



# కమ్మేసిన పొగమంచు



చిత్తూరులోని జానకారపల్లెను కమ్మేసిన మంచు



చిత్తూరులోని గాంధీ సర్కిల్



చిత్తూరు- పలమనేరు రోడ్డులో పరిస్థితి

ఉదయం 8గంటలైనా వీడని పొగమంచుతో బయటకు వెళ్లలేక జనం పనులు వాయిదా వేసుకోవాల్సివస్తోంది. క్రమం తప్పకుండా ఉదయం వాకింగు వెళ్లే వాళ్లు సాయంత్రానికి షెడ్యూల్ మార్చుకోవాల్సివస్తోంది. రహదారులపై ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగా కన్పించకపోవడంతో వేగాన్ని బాగా తగ్గించి నడపాల్సివస్తోంది. పెరిగిన చలితీవ్రతతో పిల్లలు, వృద్ధులు బాగా ఇబ్బంది పడుతున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా ఆదివారం రాత్రి నుంచీ సోమవారం ఉదయం దాకా జిల్లాలోని పలు ప్రాంతాల్లో పరిస్థితి ఇదే. ఐరాల మండలం ఉదయం 9 గంటలవుతున్నా మంచు దుప్పట్లో మునిగిపోయి ఊటీని తలపించింది. చిత్తూరు - పుత్తూరు, రాణా చెక్ పోస్ట్ - తిరుత్తణి, గంగాధరనెల్లూరు - బలిజకండ్రిగ, గంగాధరనెల్లూరు - బాలగంగనపల్లె రహదారుల్లో మంచు ప్రభావం తీవ్రంగా ఉండడంతో వాహనదారులు నానా తంటాలు పడ్డారు.వాహన డ్రైవర్లు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది.

- చిత్తూరు/బంగారుపాళ్యం/ ఐరాల/ గంగాధరనెల్లూరు, ఆంధ్రజ్యోతి



చిత్తూరు కన్నన్ కళాశాల మైదానంలో వాకర్స్



మంచుదుప్పట్లో ఐరాల



గంగాధరనెల్లూరు సమీపంలోని రాణా చెక్‌పోస్ట్‌వద్ద పరిస్థితి



బంగారుపాళ్యంలో లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న వాహనదారులు



## అంతర్రాష్ట్ర రహదారిపై ఒంటరి ఏనుగు హల్‌చల్

పలమనేరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు -గుడియాత్తం రహదారిలో ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. సాయంత్రం వేళ ఒంటరి ఏనుగును గుర్తించిన వాహన చోదకులు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారు.పలమనేరు, గంగవరం మండలాల్లో పొలాల వద్ద కాపురమున్న రైతుల ఇళ్లపై ఈ ఏనుగు దాడులకు తెగబడిన విషయం విదితమే. ఇకనైనా అటవీశాఖ అధికారులు ఈ ఒంటరి ఏనుగును కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు.

## 31 గ్రామాల్లో ప్రారంభమైన రీసర్వే

చిత్తూరు సెంట్రల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 31 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు కింద సోమవారం రీసర్వే ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 30,790 ఎకరాల్లో రీసర్వే చేసేందుకు 91 ప్రత్యేక బృందాలు రంగంలో దిగాయి. 200 నుంచి 250 ఎకరాలు ఒక బ్లాక్‌గా విభజించి రీసర్వే చేపట్టారు. రీసర్వేలో తప్పులు దొర్లకుండా డిసెంబరు 25వ తేదీనుంచి ఆయా గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించిన విషయం తెలిసిందే.

## సదరం క్యాంపులు ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బోగస్ పింఛనుదారుల ఏరివేత, అంగవైకల్యం పింఛన్‌దారుల సర్టిఫికెట్ల రీఅసెస్మెంట్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి సదరం క్యాంపులు ప్రారంభమయ్యాయి. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఈ క్యాంపులు జరుగుతున్నాయి. కుప్పం, నగరి, పలమనేరు, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అంగవైకల్యం పింఛనుదారుల రీఅసెస్మెంట్ చేపట్టారు. 2025 నవంబరు 23వ తేదీ వరకు వారానికి మూడు రోజుల చొప్పున ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో క్యాంపులు నిర్వహించనున్నారు. రోజుకు 50 మందిని పరీక్ష కేంద్రాలకు తరలించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టనున్నారు. పరీక్షల అనంతరం అర్హత ఆధారంగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేయనున్నారు.

## తిరుపతి నుంచి 7మండలాలు చిత్తూరు జిల్లాకు బదలాయింపు

### జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు

చిత్తూరు సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖకు సంబంధించి తిరుపతి జిల్లాలో ఉన్న 7 మండలాను చిత్తూరు జిల్లాకు బదలాయిస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాల విభజనలో భాగంగా అన్ని శాఖల్లోనూ తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు మండలాలను విభజించారు. అందులో భాగంగా జలవనరుల శాఖకు సంబంధించి నగరి, నిండ్ర, విజయపురం, శ్రీరంగరాజపురం, కార్వేటినగరం, పాలసముద్రం, వెదురుకుప్పం మండలాలు గతంలో తిరుపతి జిల్లాకు కేటాయించారు. నగరి, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యేల వినతితో ఈ ఏడు మండలాలను చిత్తూరు జిల్లాకు కేటాయిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## నేడు బీజేపీ జిల్లా అధ్యక్ష ఎన్నికలు

చిత్తూరు సెంట్రల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి, కడప జిల్లా మాజీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నాయకుడు బిట్ర శివనారాయణ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించనున్నారు. కోఎన్నికల అధికారులుగా కె.రవికుమార్, కేవీ చంద్రమోహన్ ఉంటారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకంతా మండల అధ్యక్షులు, ప్రతినిధులు, కార్యకర్తలు నాయకులు హాజరు కావాలని సూచించారు.

## 28 మండలాల్లో వర్షం

చిత్తూరు సెంట్రల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి సోమవారం ఉదయం ఎనిమిది గంటల వరకు 28 మండలాల్లో వర్షం పాతం నమోదైంది. తవణంపల్లెలో అత్యధికంగా 42.2 మి.మీ, అత్యల్పంగా పూతలపట్టులో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో ఇలా... పెనుమూరులో 38.4, విజయపురంలో 28.2, చిత్తూరు రూరల్‌లో 24, పాలసముద్రంలో 22.2, కుప్పంలో 20.6, యాదమరిలో 20.2, బంగారుపాళ్యంలో 18.2, కార్వేటినగరంలో 17.4, నగరి, గంగవరంలో 15.8, పలమనేరులో 14.6, చిత్తూరులో 13.8, బైరెడ్డిపల్లెలో 9.8, గుడిపాలలో 9.6, ఐరాలలో 9.4, గుడుపల్లెలో 8.6, సదుంలో 8.2, వి.కోటలో 6.2, పుంగనూరులో 4.8, ఎస్ఆర్‌పురంలో 4.2, నిండ్ర, శాంతిపురంలో 3.2, రామకుప్పంలో 2.8, సోమల, చౌడేపల్లెలో 2.6, పెద్దపంజాణిలో 2.4 మి.మీ వర్షం కురిసింది.

## ముగ్గురు డీటీల బదిలీ

చిత్తూరు సెంట్రల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్ల (డీటీల)ను బదిలీ చేస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పలమనేరు డీటీగా పనిచేస్తున్న అనిల్ కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పెద్దపంజాణి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. సస్పెన్షన్‌లో ఉన్న డీటీ ప్రసన్నకుమార్‌కు కుప్పం ఆర్డీవో కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. చిత్తూరు రీసర్వే డీటీగా పనిచేస్తున్న ఏకాంబరాన్ని జీడీ నెల్లూరు మండలానికి బదిలీచేశారు.

# సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలు

● జాబితా సిద్ధం చేస్తున్న ఎమ్మెల్యేలు



చిత్తూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల స్ఫూర్తిని వైసీపీ ప్రభుత్వం దెబ్బ తీసింది. రైతులకు సేవలందించాల్సిన సొసైటీలను రాజకీయ వేదికలుగా మార్చేసింది. ఫలితంగా గత ఐదేళ్లు వాటి ద్వారా రైతులకు ఎలాంటి భరోసా లభించలేదు. ఈ నేపథ్యంలో సహకార వ్యవస్థ ప్రక్షాళన తర్వాతే సంఘాల ఎన్నికలకు వెళ్లాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కొంతకాలం పాటు సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేసే దిశగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే జిల్లాలో ఎమ్మెల్యేలకు ఈ విషయమై సూచనలందడంతో.. త్రిసభ్య కమిటీకి అర్హుల పేర్లతో తుది జాబితాను సిద్ధం చేస్తున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 76, చిత్తూరు జిల్లాలో 37 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. ఇప్పటివరకు అధికారులే పర్సన్ ఇన్‌చార్జిలుగా వ్యవహరించగా, ఇకనుంచి ఎన్నికలు జరిగే వరకు త్రిసభ్య కమిటీలే ప్రాతినిధ్యం వహించనున్నాయి.2013 ఫిబ్రవరిలో ఎన్నికలు జరగ్గా 2018లో కమిటీలకు పదవీకాలం ముగిసింది.అయితే పాత కమిటీలనే కొనసాగించారు. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పాలకవర్గాలను రద్దు చేసి త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేసింది. ఆ పార్టీ వర్గీయులే ఈ కమిటీల్లో పదవులు పొందారు. ఆ తర్వాత కమిటీల పదవీ కాలాన్ని పొడిగించుకుంటూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే వారు పదవులకు రాజీనామా చేశారు. తాజాగా ప్రభుత్వం త్రిసభ్య కమిటీలు వేయాలనే ఆలోచన చేయడంతో ఆయా నియోజకవర్గాల్లో ఆశావహులు ఎమ్మెల్యేలతో సిఫార్సు చేయించుకుంటున్నారు. సాధారణంగా ఎన్నికలు జరిగితే ఆరుగురు సభ్యులతో పాటు ఓ ఛైర్మన్ ఉంటారు. నాటి తప్పుల ప్రక్షాళన కోసం నియమిస్తున్న ఈ త్రిసభ్య కమిటీలో ఓ ఛైర్మన్, ఇద్దరు డైరెక్టర్లు ఉంటారు. ఎన్నికలు జరిగితే పాలకవర్గం పదవీకాలం ఐదేళ్లు ఉంటుంది. ఇప్పుడు త్రిసభ్య కమిటీ పదవీకాలం ఆరు నెలల కోసం ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**● వైసీపీ హయాంలో త్రిసభ్య కమిటీలదే ఇష్టారాజ్యం**

ఉమ్మడి జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి సూచించిన వారితో 76 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలు వేశారు. ప్రతి ఆరు నెలలకో సారి వీటి పదవీ కాలాన్ని ప్రభుత్వం పెంచుకుంటూ పోయింది. ఐదేళ్ల పాటు ఈ కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి. 2020-21, 2021-22 సంవత్సరాల్లో ఉమ్మడి జిల్లాలోని 25కుపైగా విండోలు జేఎల్‌జీ (జాయింట్ లయబులిటీ గ్రూపు) రుణాలను ఇచ్చాయి. పెద్దిరెడ్డి చెప్పిన వైసీపీ నాయకులు, కార్యకర్తలకే ఈ రుణాలు ఇవ్వడంతో నయా పైసా రికవరీ కాలేదు. రైతుల పేరిట ఇచ్చామంటూ విండోల త్రిసభ్య కమిటీలు రూ.కోట్ల రుణాలను పక్కదారి పట్టించాయి.

# కాణిపాకంలో అంచెలంచెలుగా మాస్టర్ ప్లాన్ అమలు

### దేవదాయ శాఖ సీఈ శేఖర్

ఐరాల(కాణిపాకం),జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో మాస్టర్ ప్లాన్‌ను అంచెలంచెలుగా అమలు చేస్తామని దేవదాయ శాఖ సీఈ శేఖర్ తెలిపారు. సోమవారం దేవదాయ శాఖ స్తపతి పరమేశ్వరప్పతో కలసి కాణిపాకానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు ఆలయ మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్‌లోని పనులను పూర్తి చేస్తామన్నారు. అలాగే వారు కాణిపాకంలో నూతనంగా నిర్మిస్తున్న నూతన అన్నదాన సత్ర భవన నిర్మాణ పనులు, భక్తుల బస కోసం వినాయక సదన్ వద్ద నిర్మిస్తున్న గదుల నిర్మాణాలను పరిశీలించారు. ఆలయ పుష్కరిణి మార్పు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, ఈఈ వెంకటనారాయణ, దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయ ఈఈ గంగయ్య, ఆలయ ఈఈ వెంకటనారాయణ, భవిరరవి, ఏఈవో రవీంద్రబాబు, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు పాల్గొన్నారు.



మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించి, అధికారులతో మాట్లాడుతున్న సీఈ శేఖర్

# తిరుపతి ఎస్పీగా హర్షవర్ధన రాజు



తిరుపతి(నేరవిభాగం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి):తిరుపతి ఎస్పీగా మరోసారి హర్షవర్ధన రాజు నియమితులయ్యారు.గతేడాది మే 19న తిరుపతి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించి దాదాపు రెండు నెలల పాటు పని చేసిన ఈయన అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగించే విషయంలో ఈసీ నుంచి ప్రశంసలు అందుకున్నారు. పోలీసు అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని సంక్షేమం, ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి పెద్దపీట వేశారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చారు. తిరుపతిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న తరుణంలో ప్రభుత్వం ఆయన్ను కడప ఎస్పీగా బదిలీ చేసింది. అక్కడ కొద్ది నెలల పాటు పనిచేసి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన పనితీరును గుర్తించిన ప్రభుత్వం మళ్లీ తిరుపతి జిల్లాకు ఎస్పీగా నియమించింది. ఈయన రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, ప్రజలు, పోలీసులు, మీడియా సహకారంతో పోలీసు శాఖ పరంగా నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడానికి కృషి చేస్తానని చెప్పారు. గతంలో సిద్ధం చేసిన దాదాపు 10 ప్రతిపాదనలను దశల వారీగా అమలు చేస్తానన్నారు. తిరుపతిలో కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని స్మార్ట్ సిటీ నిధుల కింద సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తానని హర్షవర్ధన రాజు తెలిపారు.

## 'ఎర్రచందనం' టాస్క్‌ఫోర్సుకు సుబ్బరాయుడు



తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీగా సుబ్బరాయుడు నియమితుల య్యారు.గతేడాది జూలై 15న తిరుపతి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఈయన సమర్థ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. శాంతి భద్రతల అదుపునకు, గంజాయిని అరికట్టేందుకు విశేష కృషి చేశారు.అయితే పదిరోజుల క్రితం టీటీడీ ఆధ్వర్యంలో వైకుంఠ ద్వారదర్శనాలకోసం టికెట్లు జారీ చేసే ప్రక్రియలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడం, మరో 40 మంది గాయపడడంతో సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం టీటీడీ సీవీఎస్వోతో పాటు ఎస్పీ సుబ్బరాయుడినీ జనవరి 11న బదిలీ చేసింది. తాజాగా తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీగా నియమించింది.

# ఉగ్రవాదుల కాల్పుల్లో జవాను వీరమరణం

### ఎగువ రాగిమానుపెంటలో విషాదఛాయలు

బంగారుపాళ్యం,జనవరి20(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో సోమవారం చోటు చేసుకున్న ఉగ్రవాదుల కాల్పుల్లో చిత్తూరు జిల్లాకు చెందిన యువ జవాన్ కార్తీక్ ప్రాణాలు కోల్పోయారు.బంగారుపాళ్యం మండలం ఎగువ రాగిమానుపెంటకు చెందిన వరదరాజులు, సెల్వి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాజేష్, చిన్న కుమారుడు కార్తీక్ (29). కార్తీక్ ప్రాథమిక విద్యాభ్యాసం బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియట్ చిత్తూరు పీసీఆర్ జూనియర్ పూర్తి చేశాడు. డిగ్రీ చదువుకుంటూ 2017లో ఆర్మీలో చేరాడు. దీపావళికి ఇంటికి వచ్చి వారం పాటు కుటుంబ సభ్యులతో స్నేహితులతో గడిపాడు. మే నెలలో మళ్లీ వస్తానని చెప్పి విధులకు వెళ్లాడు. ఆదివారం నార్త్ జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదులు, సైనికుల మధ్య జరిగిన కాల్పుల్లో కార్తీక్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆర్మీ అధికారులు ఆస్పత్రిలో చేర్పించారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కార్తీక్ తండ్రి వరదరాజులకు ఆర్మీ అధికారులు ఫోన్ చేసి.. మీ కుమారుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. సాయంత్రం మళ్లీ ఫోన్ చేసి వీరమరణం పొందాడని సమాచారం ఇచ్చారు. దీంతో రాగి మానుపెంటలో విషాదఛాయలు అలుముకున్నాయి. మంగళవారం కార్తీక్ పార్థివదేహం ఎగువ రాగిమానిపెంటకు చేరుకుంటుందని ఆయన తండ్రి వరదరాజులు తెలిపారు.



కార్తీక్ (ఫైల్ ఫొటో)



కుటుంబీకులతో కార్తీక్

## డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, పద్మావతి డిగ్రీ కాలేజీకి చెందిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలు సోమవారం విడుదల య్యాయి. ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు ఇందుకు సంబంధించిన ఫలితాలను విడుదల చేశారు. ఈ కాలేజీలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించిన నేపథ్యంలో తొలిసారిగా స్వయంగా కాలేజీలే పరీక్షలు నిర్వహించి, ఫలితాలను ప్రకటించాయి. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు 54.2 శాతం, పద్మావతి డిగ్రీ కాలేజీ విద్యార్థులు 81 శాతం ఉత్తీర్ణత సాధించారు.


ఆలయం ముందు అశ్విన్‌బాబు, బాబీ, తమన్

## స్వామివారు పెద్ద బ్లాక్‌బస్టర్ ఇచ్చారు

'డాకు మహారాజ్' దర్శకుడు బాబీ

తిరుమల, జనవరి20(ఆంధ్రజ్యోతి): 'డాకు మహారాజ్'తో శ్రీవేంకటేశ్వరస్వామి చాలా పెద్ద బ్లాక్‌బస్టర్ ఇచ్చారని ఆ చిత్ర దర్శకుడు బాబీ సంతోషం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు తమన్, నటుడు అశ్విన్ బాబుతో కలిసి ఆయన సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రెండేళ్ల క్రితం 'వాల్తేరు వీరయ్య' సినిమాతో వచ్చామని, అప్పుడూ స్వామివారు మంచి విజయాన్ని ఇచ్చారన్నారు. తాజాగా 'డాకు మహారాజ్'ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్ చెబుతున్నానన్నారు. తొలి నుంచే ఈ సినిమాపై చాలా ఆశలు పెట్టుకున్నామని తమన్ అన్నారు. అందుకే స్వామికి థ్యాంక్స్ చెప్పేందుకు వచ్చామన్నారు. శ్రీవారి ఆశీస్సులు లేకుండా ఏదీ ప్రారంభించనన్నారు.


## శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

**శనివారం నాటి హుండీ ఆదాయం:** రూ.3.68 కోట్లు

**ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు:** 70,826

**తలనీలాలు సమర్పించినవారు:** 22,625












పిల్లల కేరింతలు..

పిట్టల కిలకిలలు..













# కళకళలాడిన నేలపట్టు

ఘనంగా జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్

మూడు రోజులూ పోటెత్తిన జనం

చెరువు కట్టల మీద విద్యార్థుల కేరింతలూ.. చెరువులోని చెట్లమీద పిల్లపక్షుల కిలకిలలూ.. ఫ్లెమింగో ఫెస్టివల్ మూడోరోజున నేలపట్టు కళకళలాడింది. రకరకాల యూనిఫారాల్లో ఎటు చూసినా పిల్లలే సందడిగా కనిపించారు. చెరువులోని చెట్లమీద రకరకాల పక్షి పిల్లలు ముక్కులతో పొడుచుకుంటూ, రెక్కలు విప్పుకుని ఎగరడం నేర్చుకుంటూ, చెరువులో వాలి జలకాలాటలాడుతూ అలరించాయి. సెప్టెంబరు నుంచీ వివిధ దేశాల నుంచీ విడతలవారీగా వస్తున్న పక్షులు ఈ చెట్లమీద గూళ్లు పెట్టుకుని, సహచరులను ఆకర్షించి జతకట్టి, గుడ్లుపెట్టి పొదిగాయి. ఇప్పుడీ పిల్లలు రెండు నెలల వయసుకు చేరుకున్నాయి. బుజ్జి పిట్టల బొజ్జనింపి బువ్వపెట్టేందుకు అమ్మ పక్షులు ఆహారం వెతుకుతూ వెళ్లిపోయాయి. ఈ పిల్ల పిట్టలు ఎండకు రెక్కలార్చుకుంటూ, ముక్కులు పదును పెట్టుకుంటూ గడుపుతున్నాయి. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌లు తమ కెమెరాల్లో బంధించారు.










## ఉల్లాసంగా ఉత్సాహంగా పడవల్లో..





తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పక్షుల పండుగ చివరిరోజు సోమవారం పర్యాటకులతో పులికాట్ సరస్సు పులకించిపోయింది. పెద్ద సంఖ్యలో పర్యాటకులు విద్యార్థులు పడవ షికారుకు ఉత్సాహం చూపారు. కాళహస్తి, గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి పరిసర ప్రాంతాల నుంచి పాఠశాలల విద్యార్థులు ప్రత్యేక బస్సుల్లో పడవ షికారుకు వచ్చారు. పులికాట్ తీరాన నీళ్లలో ఉత్సాహంగా గంతులు వేశారు. ఇక్కడి వేదికమీద స్థానిక విద్యార్థులతో పాటు కొందరు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చివరిరోజున సాయంత్రం 6 గంటల వరకు పడవ షికారు జరిగింది.

### పడవ షికారు అద్భుతం



పులి కాట్‌లో పడవలో తిరగడం ఆనం దంగా ఉంది. ఎటు చూసినా నీళ్లే. ఇదే తొలిసారి నేను పడవ ఎక్కడం. నేలపట్టులో పక్షులను చూసి ఇక్కడికి వచ్చాం. ఎన్ని పక్షులో అక్కడ!

- తేజశ్విని, 6వ తరగతి, పెద్దకన్నలి, తొట్టంబేడు మండలం

## సూళ్లూరుపేటలో సందడే సందడి

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ చివరిరోజు పర్యాటకులతో కళాశాల మైదానం సందడిగా కనిపించింది. పలు ప్రాంతాల విద్యార్థులు, పర్యాటకులు స్టాల్స్‌ను చూస్తూ ఎంజాయ్ చేశారు. ముఖ్యంగా షార్ రాకెట్‌లను చూస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం సైతం పర్యాటకుల కోసం పూర్తి స్థాయిలో బస్సులు ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో ఆటోలే దిక్కుఅయ్యాయి. కళాశాల మైదానం చుట్టుపక్కల రోడ్లను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని భద్రతా ఏర్పాట్లు చేశారు.

## ఆటల వేదికలా అటకానితిప్ప


పర్యావరణం కాపాడటంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఓజిలి/సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అటకానితిప్ప ప్రాంతంలో పక్షులను చూసేందుకు సోమవారం విద్యార్థులు, సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. సత్యవేడు, పల్లమాల, బాకరాపేట, పలమనేరు, చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వందలాదిగా విద్యార్థులు తరలిరావడంతో అటకానితిప్ప కిటకిటలాడిపోయింది. ఇక్కడ పిల్లల వినోదం కోసం ఏర్పాటు చేసిన ప్రదేశంలో ఆటల్లో పిల్లలు సందడిగా గడిపారు. పక్షుల ప్రదర్శనశాలలో పులికాట్, అటకానితిప్ప, నేలపట్టు, సమీప ప్రాంతాల విశిష్టతపై ప్రదర్శించిన ఫిల్మ్‌షోను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థుల సందేహాలకు సిబ్బంది సమాధానాలు ఇచ్చి మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, పక్షులపై అవగాహన కల్పించారు. ఈ ప్రాంతానికి సమీపంలో పులికాట్‌లో నీరు ఎండిపోవడంతో పక్షులు దూరంగా వెళ్లిపోవడంతో సందర్శకులు ఒకింత నిరాశకు గుయ్యారు.

### సంతోషంగా ఉంది



ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రావడం వల్ల చాలా తెలుసుకున్నాం. అటకానితిప్పలో ఫిల్మ్‌షో చాలా బావుంది. బీవీపాళెం రేవులో పడవ ప్రయాణం వింత అనుభూతిని ఇచ్చింది.

- టి నందిని, 10వ తరగతి, ఇరుగుళం స్కూల్, సత్యవేడు మండలం.








శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కార్యక్రమాలతో జనం ఉర్రూతలూగారు. బుల్లితెర యాంకర్లు రవి, కావ్య, అమూల్య మాటల గారడీలతో ఆకట్టుకోగా.. మిమిక్రీ రాజు తన మిమిక్రీతో జనాలను కట్టిపడేశారు. మల్కిట్‌సింగ్ చేసిన నృత్య ప్రదర్శన అబ్బురపరచింది. సినీ గాయని మంగ్లీ తన ఆటపాటలతో జనాలను హుషారెత్తించారు.

### ప్రకృతిని.. సంస్కృతిని తల్లిలా చూడాలి

ముఖ్య అతిథిగా వచ్చిన సినీ హీరోయిన్ సంయుక్త మీనన్ 'హాయ్' అంటూ సభికులను పలకరించారు. ప్రకృతి, సంస్కృతిని తల్లిలా చూడాలన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం మన బాధ్యతన్నారు. వాటర్ బాటిల్ పారవేయడం తేలికని, దాని ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని గుర్తించాలన్నారు. మరో సినీ హీరోయిన్ కృతిశెట్టి మాట్లాడుతూ.. మన సంస్కృతిని ఎన్నో దేశాలు ఆహ్వానిస్తుంటాయని, మనంకూడా సోషల్ మీడియాలో దీనిని బాగా ప్రమోట్ చేసేలా కృషి చేయాలని కోరారు.



## సామాజిక సేవ చేయాలనుంది

### మిస్ గ్లోబల్ భావనారెడ్డి



తిరుపతి(ఆటోనగర్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తానని మిస్ గ్లోబల్ పి.భావనారెడ్డి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ బాల్యం నుంచే అన్ని రంగాల్లో రాణిస్తున్నానని తెలిపారు. ఫ్యాషన్ రంగంలో రాణించాలన్న తన సంకల్పం ఫలించిందన్నారు. దేశం గర్వించే స్థాయికి ఎదగాలన్న ఆకాంక్ష ఉందన్నారు. తాను స్థాపించిన మిత్రా ఫౌండేషన్ సంస్థ ద్వారా సామాజిక సేవ చేస్తామని చెప్పారు. త్వరలోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కొల్లు రవీంద్రలను కలసి తాను చేపట్టబోయే సేవా కార్యక్రమాల గురించి వివరిస్తానన్నారు.

## ఏజీబీఎస్సీ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి మార్గదర్శకాలు

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం జారీ చేసింది. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల తరహాలో మేనేజ్‌మెంట్ కోటా( కేటగిరి బీ) సీట్లను భర్తీ చేయాలని స్పష్టత ఇచ్చింది. అగ్రికల్చర్ బీఎస్సీ(హానర్స్)లో కేటగిరి బీ కింద మిగిలిపోయిన సీట్లను మొదట ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన వారితో నింపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇంటర్మీడియట్ బైపీసీలో 45%పైగా మార్కులు వచ్చిన ఓసీలకు, బీసీ,ఎస్సీఎస్టీలకు 40%పైన మార్కులు వచ్చిన వారికి అవకాశం కల్పించాలని, ఇంకా ఖాళీలు ఉంటే మార్కుల శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.

## ద్విచక్ర వాహనాల దొంగలు ఇద్దరు అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసు అధికారులు

వి.కోట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వి.కోట మండలంలో ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ కథనం మేరకు.. పోలీసులు సోమవారం ఉదయం అన్నవరం క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. పడిగలకుప్పానికి చెందిన విశ్వనాథరెడ్డి(31) ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఆపి రికార్డులు చూపించాలని కోరారు. అతడు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో జల్సాలకు, తాగుడుకు బానిసై భైరుపల్లె గ్రామానికి చెందిన నాగరాజు(34)తో కలిసి ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నట్టు అంగీకరించాడు. అతడిచ్చిన సమాచారంతో భైరుపల్లెకు వెళ్లి నాగరాజును అరెస్టు చేశారు. అక్కడ ఉన్న నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

### ఎమ్మెల్యే పెద్దిరెడ్డి అనర్హత కేసు

## ఫిబ్రవరి 3వ తేదీకి వాయిదా

- రెవెన్యూ ముఖ్య కార్యదర్శిని ప్రతివాదిగా చేర్చాలి
- బీసీవై అధినేత రామచంద్రయాదవ్

పుంగనూరు, జనవరి20(ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అనర్హత వేటుకు సంబంధించి హైకోర్టులో నడుస్తున్న కేసు ఫిబ్రవరి 3వ తేదీకి వాయిదా వేసినట్లు బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో ఆయనతో బాటు భార్య స్వర్ణలత పేరుతో ఉన్న 142 ఆస్తుల వివరాలను పొందుపరచలేదని తాను గత ఏడాది జూన్ 7వ తేదీ హైకోర్టును ఆశ్రయించినట్లు గుర్తుచేశారు. సోమవారం నాటికి హైకోర్టులో 14 వాయిదాలు ముగిసినా ఎన్నికల్లో పోటీ చేసిన టీడీపీ, ఇతర పార్టీల అభ్యర్థులు ఎవరూ దీనిలో ఇంప్లీడ్ కాలేదన్నారు. తాను అందజేసిన పెద్దిరెడ్డి ఆస్తులను ప్రభుత్వం ఇంతవరకు ధ్రువీకరించకుండా జాప్యం చేస్తుండడంతో కేసు పురోగతి సాధించడానికి ఈ కేసులో రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శిని ప్రతివాదిగా చేర్చాలని హైకోర్టును కోరినట్లు ఆయన చెప్పారు.

### అపోలో వర్సిటీలో డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసిన్ సెంటర్ ప్రారంభం



లెస్టర్ వర్సిటీతో ఎంవోయూ కుదుర్చుకున్న ప్రతాప్ సీ రెడ్డి

చిత్తూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో యూనివర్సిటీలో డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసిన్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సెంటర్‌ను అపోలో గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి ప్రారంభించి, ప్రసంగించారు. టెక్నాలజీ ఉపయోగించి ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి ఈ సెంటర్ ఉపయోగపడుతుందని చెప్పారు. మెడికల్ ఎమర్జెన్సీ సమయంలో రోగికి ఉన్న వ్యాధి, వాడిన మందులు సులువుగా తెలుసుకుని, కచ్చితమైన వైద్యసాయం త్వరగా అందించవచ్చన్నారు. ఇందుకోసం యూకేకు చెందిన యూనివర్సిటీ లెస్టర్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నామని తెలిపారు. అపోలో వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి, జాయింట్ ఎండీ సంగీతారెడ్డి, జాయింట్ డైరెక్టర్ కార్తీక్‌రెడ్డి, లెస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నిషాన్ కనకరజా, అపోలో వైస్ చాన్సలర్ వినోద్ భట్, చిత్తూరు యూనిట్ హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అపోలో యూనివర్సిటీ స్నాతకోత్సవం



పట్టా పొందిన విద్యార్థులతో ప్రతాప్ సీ రెడ్డి

చిత్తూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని అపోలో యూనివర్సిటీ స్నాతకోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న 60 విద్యార్థులు అపోలో గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి నుంచి పట్టాలు అందుకున్నారు. మేనేజ్‌మెంట్, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్స్‌లో 30 మంది, ఎమ్మెస్సీ ఇన్ ఫిజియోథెరపీలో 15 మంది, ఎమ్మెస్సీ ఇన్ హెల్త్ ఇన్ఫోటెక్ అండ్ అనలసిస్ట్‌లో ఒకరు, ఎంబీఏ ఇన్ హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్‌లో 11 మంది, జనరల్ ఎంబీఏ విద్యార్థులు ముగ్గురు తమ కోర్సులను పూర్తి చేసుకుని పట్టాలు పొందారు. ఈ కార్యక్రమంలో లెస్టర్ వర్సిటీ వైస్ చాన్సలర్ నిషాన్, అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వినోద్‌భట్, అపోలో ఎడ్యుకేషన్ ఎండీ కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.80 కోట్లు



ఈవో పర్యవేక్షణలో హుండీ కానుకలులెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,80,98986 లభించింది. ఆస్థాన మండపంలో ఈవో పెంచలకిషోర్ ఆధ్వర్యంలో హుండీ కానుకలను సోమవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. ఈ ఆదాయంలో 27 గ్రాముల బంగారు, 961 గ్రాముల వెండితోపాటు 804 యూఎస్ఏ, 780 ఆస్ట్రేలియా, 20 కెనడా డాలర్లు, 5 యూఏఈ దిర్హామ్స్, 10 ఇంగ్లాండు పౌండ్లు, 15 యూరోలు లభించాయని ఈవో తెలియజేశారు. నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.41,517, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.9,525 సమకూరినట్లు వివరించారు. ఆలయానికి ఈ ఆదాయం 24 రోజుల్లో లభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### పశు ఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

- పాడి రైతులకు కలెక్టర్ సూచన

చిత్తూరు సెంట్రల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమైన ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. నూతన గ్రీవెన్స్ హాలులో జేసీ విద్యాధరితో కలిసి ఉచిత పశువైద్య శిబిరాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీ వరకు శిబిరాలు జరుగుతాయని చెప్పారు. ప్రభుత్వం పశుపోషణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్‌కుమార్, జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యలే అధికం

- కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు వచ్చిన మొత్తం అర్జీలు 276

చిత్తూరు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. మొత్తం 276 అర్జీలు వచ్చాయి. వీటిల్లో రెవెన్యూ సమస్యలే అధికంగా ఉన్నాయి. ఈ శాఖకు ఏకంగా 228 అర్జీలు వచ్చాయి. డీఆర్‌డీఏకు 10, పోలీసు శాఖకు 7, పశు సంవర్ధకశాఖకు 5, పంచాయతీరాజ్, డీఈవో, డీఎంహెచ్‌వో, మార్కెటింగ్, హౌసింగ్, ఐసీడీఎస్ తదితర శాఖలకు కలిపి 16 అర్జీలు అందాయి. బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు అర్జీలను స్వీకరించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**ప్రధాన సమస్యలు ఇలా..**

- గుట్ట ప్రాంతంలో అక్కడక్కడా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న యానాదులకు ఒకేచోట మూడు సెంట్ల వంతున ఇళ్ల స్థలాలను కేటాయించాలని బంగారుపాళ్యం మండలం మొగిలి యానాదుల సంఘం కమిటీ సభ్యులు కోరారు. యానాదులకు కేటాయించిన భూములను 12 మంది ఆక్రమించుకున్నారని, వారి పట్టాలను రద్దు చేసి గుట్ట ప్రాంతంలో యానాదులకు ఇళ్ల స్థలాలు, స్కూల్, హాస్టల్ సౌకర్యాలను కల్పించాలని విన్నవించారు.



కలెక్టరేట్ వద్ద మొగిలి యానాదుల సంఘం సభ్యులు



కుటుంబీకులతో మునెమ్మ

- తనకు సర్వే నెంబరు 174-3లో ప్రభుత్వం రెండున్నర సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని చిత్తూరులోని ఇరువారంకు చెందిన మునెమ్మ తెలిపారు. ఈ స్థలాన్ని ప్రకాష్ అనే వ్యక్తి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని ఫిర్యాదు చేశారు.
- రేషన్ సరుకులు తీసుకోవడానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న కొత్తూరుకు వెళ్లాల్సి రావడం కష్టంగా ఉందని గుడిపాల మండలం మరకాలకుప్పం పంచాయతీలోని చామంతిపురంవాసులు తెలిపారు. అందరం కూలి పనులు చేసుకునేవారమని దగ్గరలోనే రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని కోరారు.
- ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలని గంగాధరనెల్లూరు మండలం పాతపాళ్యంకు చెందిన దివ్యాంగుడు మంజునాథ్ కోరారు. 20 ఏళ్లగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.
- తన భర్త మరణించి రెండేళ్లవుతున్నా ఇంత వరకు పెన్షన్‌ను మంజూరు చేయలేదని తవణంపల్లె మండలం దిగువ మాఘం గ్రామానికి చెందిన సరస్వతి కోరారు.
- కిడ్నీ వ్యాధితో ఇబ్బంది పడుతున్న తన కుమారుడు దావూద్‌మస్తాన్‌కు రూ.15వేల పింఛను మంజూరు చేయాలని బంగారుపాళ్యంకు చెందిన జిలానీబాష కోరారు.
- వికలాంగుల శాఖ ద్వారా ప్రభుత్వం అందించే ఫోన్లను తమకు మంజూరు చేయాలని దివ్యాంగులైన వెంకటేశ్, జయశంకర్, బాలకృష్ణ తదితరులు కోరారు.
- తమ బిడ్డల్లాగా గ్రామంలో ఎవరూ డెంగ్యూ బారిన పడకుండా ఉండాలంటే పాడుబడిన బావిలో చెత్తను వేయకుండా నివారించాలని బంగారుపాళ్యం మండలం కుమ్మరపల్లెకు చెందిన సురేంద్రబాబు, మోహిని కోరారు. బావిలోని చెత్తవల్ల దోమలు పెరిగి తమ బిడ్డలు రెండేళ్లగా డెంగ్యూ బారినపడి ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ విద్యాధరి

### జిల్లా పోలీసు కార్యాలయానికి 66 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధితుల నుంచి ఏఎస్పీ రాజశేఖర్‌రాజు వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తం 66 అర్జీలు అందాయి. వీటిల్లో.. భూ తగాదాలపై 22, డబ్బు తగాదాలపై 19, కుటుంబ తగాదాలపై 14, ఆస్తి తగాదాలపై 7, ఇంటి తగాదాలపై 2, వేధింపులు, చీటింగ్‌పై ఒక్కో అర్జీ చొప్పున ఉన్నాయి. అర్జీలపై నిర్లక్ష్యం చేయకుండా బాధితులకు న్యాయం చేయాలని సిబ్బందిని ఏఎస్పీ ఆదేశించారు.



బాధితుడితో మాట్లాడుతున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

### డైట్‌లో శిక్షణకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

వెదురుకుప్పం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభావంతమైన తరగతి గది, బోధనలో డిజిటల్ వనరుల వినియోగంపై కార్వేటినగరం డైట్‌లో ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నారు. దీనికోసం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు మాత్రమే శిక్షణ కార్యక్రమానికి హాజరవడానికి అర్హులని, వీరికి రవాణా భత్యం, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు.

### నీట్‌గా సెట్ చేసుకోండి...

## మంత్లీ మామూలు ఇచ్చేయండి

- లాడ్జి మేనేజర్‌తో హోంగార్డు సంభాషణ

వి.కోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నీట్‌గా సెట్ చేసుకోండి.....మాకు ఠంచనుగా మంత్లీ ఇచ్చేయండి అంటూ ఓ లాడ్జి మేనేజర్‌తో హోంగార్డు ఒకరు జరిపిన ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వి.కోటకు చెందిన ఒక హోంగార్డు స్థానికంగా ఉన్న ఓ లాడ్జి మేనేజర్‌తో ఇటీవల ఫోన్‌లో సంభాషించాడు. 'మాసార్ రెండు రోజులు వి.కోటలో అందుబాటులో ఉండరు..ఈ చాన్స్‌ను వాడుకోమని చెప్పాడు. ఎంతమందినైనా తెప్పించుకో.... జాగ్రత్తగా నడుపుకో.మాకివ్వాల్సింది ఠంచనుగా మంత్లీ చేర్చేయ్' అను సూచించాడు. లాడ్జిలో సీసీ కెమెరాలున్నాయని,కాబట్టి మార్కెట్ వద్ద ఇంటిని అద్దెకు తీసుకుంటామని మేనేజర్ చెప్పగా, బయటకు పొక్కకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని హోంగార్డు సూచించాడు.అధికారుల సంగతి తాను చూసుకుంటానని హోంగార్డు భరోసా ఇచ్చాడు. తనకు అడ్వాన్సుగా రూ.3వేలు పంపాలంటూ యూపీఐ నెంబరు చెప్పగా, వచ్చేవారం పంపుతానని మేనేజర్ బదులిచ్చాడు.అయితే ఏం జరిగిందో కానీ, ఆ వాయిస్ రికార్డు సోమవారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఈ విషయమై సీఐ సోమశేఖర్‌ను వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

### వరసిద్ధుడి ఆలయానికి రూ.4లక్షల విరాళం



చెక్కును అందిస్తున్న హనుమంతరావు

ఐరాల(కాణిపాకం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన హనుమంతరావు కుటుంబ సభ్యులు రూ.4,00,232లను చెక్కు రూపంలో సోమవారం అందజేశారు. ఇందులో అన్నదాన కార్యక్రమానికి రూ.3,00116, గో సంరక్షణ ట్రస్టు నిర్వహణకు రూ.1,00,116 ఉన్నట్లు ఏఈవో రవీంద్రబాబు తెలిపారు. దాతను ఏఈవో ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారి అన్నప్రసాదంలో మసాలా వడ



తిరుమల, జనవరి20(ఆంధ్రజ్యోతి): శ్రీవారి అన్నప్రసాదాల మెనూలో టీటీడీ మసాలా వడను చేర్చింది. భక్తులకు కొన్నేళ్లుగా అన్నంతో పాటు కర్రీ, కొబ్బరి చట్నీ, చక్కెర పొంగలి, సాంబారు, రసం, మజ్జిగ వడ్డిస్తున్నారు. అన్నదానం మెనూలో మరో పదార్థం చేర్చాలని గతేడాది నవంబరు 18న టీటీడీ ధర్మకర్తల మండలి తీర్మానించింది. ఈక్రమంలో సోమవారం మధ్యాహ్నం ప్రయోగాత్మకంగా ఉల్లి, వెల్లుల్లి లేకుండా దాదాపు 5 వేల వడలను తయారు చేసి భక్తులకు వడ్డించారు. దీనిపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేయడంతో మరో నాలుగు రోజుల పాటు వడల తయారీని పెంచి వడ్డించనున్నారు. రథసప్తమి నాటికి రెండుపూటలా అందించేలా టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. మసాలా వడ మాత్రమే కాకుండా ఆ స్థానంలో మరేదైనా పెట్టవచ్చా అనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.



ముగింపు సభలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, వేదికపై ఎమ్మెల్యేలు, నాయకులు, సినీనటులు, అధికారులు

## ప్రభుత్వ ప్రాధాన్యాలు ప్రకృతి, సంస్కృతి

- పక్షుల పండుగ ముగింపు సభలో మంత్రి సత్యప్రసాద్

సూళ్లూరుపేట/తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని, సంస్కృతిని గుర్తుపెట్టుకోవడమే కాకుండా వాటి ద్వారా పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సూళ్లూరుపేటలో సోమవారం రాత్రి జరిగిన మూడు రోజుల పక్షుల పండుగ ముగింపు సభలో ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొన్నారు. వైసీపీ నిలిపేసిన ఈ పండుగను తమ ప్రభుత్వం వచ్చిరాగానే తిరిగి ప్రారంభించాలని చంద్రబాబు ఆదేశించారన్నారు. సీఎం సూచనల మేరకు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించామన్నారు.ముగింపు రోజున నేలపట్టులో పక్షుల వీక్షణకు భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు. అటకానితిప్ప వద్ద కూడా ఆటలతో సందడిగా గడిపారు. బీవీపాలెం పడవల రేవు మూడో రోజు కూడా కిక్కిరిసిపోయింది. సూళ్లూరుపేట ప్రధాన వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద జనం బారులు తీరారు.మరోవైపు ఆటల్లోనూ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించేందుకు ప్రజలు పోటెత్తి వచ్చారు. సూళ్లూరుపేట కాలేజీ మైదానం నిండిపోయి, ప్రజలు బయటకూడా బారులు తీరారు. సినీరంగానికి చెందిన కళాకారులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. హీరోయిన్లు సంయుక్త మీనన్, కృతిశెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంగ్లీ పాట హుషారెత్తించింది.



హీరోయిన్లు కృతిశెట్టి , సంయుక్త మీనన్

**20 నిమిషాల్లోనే సభ పూర్తి**

పక్షుల పండుగ ముగింపు సమావేశం 20 నిమిషాల్లో ముగిసిపోయింది. మంత్రులు, నాయకులు, అధికారులు ముఖ్య అతిథులంతా 7 గంటలకే వేదిక వద్దకు చేరుకున్నారు. సుమారు గంటకుపైగా సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు.దేవదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించాక స్టేజీ పైకి రాకుండానే వెళ్లిపోయారు.



పక్షుల పండుగ ముగింపు సభకు హాజరైన జనం

## ఏనుగులను అడవుల్లోకి మళ్లించడానికి ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు

- డ్రోన్ల ద్వారా కదలికలు గుర్తిస్తాం
- జిల్లా అటవీశాఖ అధికారి వివేక్



తిరుపతి(మంగళం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పంటలపై ఏనుగుల దాడిని నివారించడానికి, వాటిని అడవుల్లోకి మళ్లించడానికి ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశామని జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ తెలిపారు. తిరుపతిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎలిఫెంట్ ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలో పదిమంది ఉంటారని, ఇలా మూడు టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఇవి సబ్ డివిజనల్ ఫారెస్టు అఫీసర్ పర్యవేక్షణలో పనిచేస్తాయన్నారు. డ్రోన్ల సాయంతో ఏనుగుల గుంపు కదలికలను పరిశీలిస్తారన్నారు. ఎప్పటికప్పుడు వాటిని గుర్తించి పంచాయతీ, అగ్రికల్చర్ అసిస్టెంట్, విద్యుత్‌శాఖ, అటవీశాఖకు చెందిన అధికారులతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్‌లకు సమాచారం అందిస్తారన్నారు. వారు తమ పరిధిలోని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తారని వివరించారు. ఏనుగుల కట్టడికి గ్రామస్తుల సహకారం అవసరమన్నారు. కాగా, 9 నెలలుగా ఏనుగుల గుంపు చంద్రగిరి మండలం కందులవారిపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో తిరుగుతోందని, నెల క్రితమే వాటికి పిల్లలు కలిగాయని చెప్పారు. ట్రాకర్ల ద్వారా ఏనుగుల గుంపును అటవీ ప్రాంతంలో మళ్లించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అటవీ సరిహద్దు గ్రామాల పరిధిలో ప్రచార జాతాలు, టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటును పరిశీలిస్తున్నామన్నారు.

### జాతీయ భావం ఉట్టిపడేలా గణతంత్ర దినోత్సవం : డీఆర్వో

చిత్తూరు సెంట్రల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జాతీ య భావం ఉట్టిపడేలా గణతంత్ర దినోత్సవం నిర్వహించాలని డీఆర్వో మోహన్ కుమార్ ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సోమవారం తన సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. చిత్తూరు పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాట్లను అన్నిశాఖలు అధికారులు సమన్వయంతో చేయాలన్నారు. అలాగే తమకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు రవికుమార్, శ్రీదేవి, డీఈవో వరలక్ష్మి, ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ గోపాల్ నాయక్, జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి, కలెక్టరేట్ ఏవో కులశేఖర్ పాల్గొన్నారు.

# ఆగిన అభివృద్ధిని పరుగులు తీయిస్తున్న ప్రభుత్వం


గ్రామసభలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆగిపోయాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధి బందార్లపల్లె గ్రామ సచివాలయంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్‌లు పంచాయతీలకు నిధులు విడుదల చేశారన్నారు. బందార్లపల్లె పంచాయతీకి 2025-26 సంవత్సరానికి రూ.25లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పాలకులు, అధికారులు ప్రజలతో చర్చించి ఆ నిధులతో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రాజగోపాల్, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథరెడ్డి, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, జనసేన మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్, మాజీ సర్పంచు పెరుమాళ్, నాయకులు మునిరెడ్డి, మురళీమోహన్ పాల్గొన్నారు.

# కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

కుప్పం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఇటీవల వెలువడిన ఫైనల్ ఇయర్, సెకండ్ ఇయర్ పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగన్నాథరావు తెలిపారు. కంప్యూటర్స్ విభాగంలో నవనీత్ 889 మార్కులు, ఎలక్ట్రానిక్స్ విభాగంలో వి.తేజస్విని 984 మార్కులు సాధించి ఉత్తమ ర్యాంకులు పొందారన్నారు. కడా ఆధ్వర్యంలో అంతకుముందు జరిగిన క్రాక్ అకాడమీ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన తమ కళాశాల విద్యార్థిని ఒ.వెన్నెలను కుప్పం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు, అధ్యాపకులు ఇతర సిబ్బంది అభినందించారు.

# పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి


పశువులకు నట్టల నివారణ మందులు వేస్తున్న వైద్యులు

కల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని టీడీపీ నాయకులు కరుణాకర్ నాయుడు, అబ్బాస్, ఖాదర్‌వల్లి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ తలారివారిపల్లెలో సోమవారం పశువైద్యాధికారి మునిచంద్ర ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులతో 70 శాతం నుంచి 90 శాతం రాయితీతో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. పశుపోషకులకు ఎటువంటి హామీ లేకుండా పశు కిసాన్ క్రెడిట్ కార్డులు అందిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మునిచంద్ర, సిబ్బంది దాము, మునిప్రకాష్, కల్పన, గోపాలమిత్రలు నరసింహులు, బాబు పాల్గొన్నారు.

# అమ్మవారికి పొంగళ్ల సమర్పణ



రామకుప్పం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పంచాయతీ కేంద్రం ముద్దనపల్లెలో సోమవారం సంక్రాంతి సంబురాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం స్థానిక కుంటిగంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. మధ్యాహ్నం గ్రామస్తులు డప్పుల హోరు, బాణాసంచా పేలుళ్ల మధ్య ఊరేగింపుగా బయలుదేరి, ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చారు. అమ్మవారికి పొంగళ్లు సమర్పించి దీపారాధనలు చేశారు. పలువురు అమ్మవారికి జంతుబలులు సమర్పించారు. గురువారం గ్రామ పొలిమేర్లలోని అమ్మవారి ఆలయాల్లో పూజలు, పొంగళ్ల సమర్పణ, దీపారాధనలు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. మధ్యాహ్నం పశువుల పండుగ నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

# పాడిరైతులకు అండగా కూటమి ప్రభుత్వం

రామకుప్పం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాడిరైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని టీడీపీ సీనియర్ నేత రామ్మూర్తి, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్‌లు తెలిపారు. సోమవారం మండల పరిధి ఉస్సిగానిపల్లె పంచాయతీ ఆనిగానూరు గ్రామంలో పశువైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడిరైతులను ప్రోత్సహించేందుకు రాయితీతో గోకులం షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పశువైద్యాధికారి వెంకటేశ్, నేతలు మహేంద్రనాయుడు, శంకర్‌చలం, మణేష్ పాల్గొన్నారు.





## నేడు డయల్ యువర్ డీఎం

పుంగనూరు రూరల్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవడానికి డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం సుధాకరయ్య తెలిపారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణికులు 9100941850కు ఫోన్‌చేసి సూచనలు, సలహాలు, సమస్యలు, సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు చేయవచ్చునని వివరించారు.

## పాడి పరిశ్రమ అభివృద్ధే ధ్యేయం

పుంగనూరు రూరల్, జనవరి20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పుంగనూరు మండల పశువైద్యాధికారి డాక్టర్ కృష్ణకాంత్ తెలిపారు. సోమవారం మండలంలోని ఏతూరు గ్రామంలో 52 పశువులకు పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. నట్టనివారణ మందులు పిచికారి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆదిలక్ష్మి, రకుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

పుంగనూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎన్‌జీవో సంఘ నాయకులు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి విన్నవించారు. సోమవారం రొంపిచెర్లలోని ఆయన స్వగృహంలో ఎన్జీవో ఉద్యోగసంఘ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్జీవో సంఘనాయకులు రహ్మత్‌అలీఖాన్, సురేశ్‌రాజు, లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం, దాము, వెంకటముని, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్ర సందర్శనలు చేయండి

సోమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయి సందర్శనలతో పరిష్కరించాలని తహసీల్దార్ బెన్నురాజ్ తెలిపారు. సోమల వీఆర్వోలతో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై ఆరా తీశారు. భూ వివాదాలను క్షేత్రస్థాయిలోనే ఇరువర్గాలతో కలసి పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో డీటీ ఇబ్రహీం, ఆర్ఐ సుబుక్తుల్లా, వీఆర్వోలు పాల్గొన్నారు.

## పాఠశాలలో తనిఖీలు


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం

పలమనేరు, జనవరి20(ఆంధ్రజ్యోతి) : పలమనేరు నార్త్ పాఠశాలలో సోమవారం ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం తనిఖీలు చేశారు. ఆన్‌లైన్‌లో ఉన్న హాజరు, పాఠశాలలో ఉన్న విద్యార్థుల హాజరును, శానిటేషన్‌ను, ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఇందిర, సీఆర్ఎంటీ హరిబాబు పాల్గొన్నారు.

## రైతు సమస్యలకు పరిష్కారం చూపండి

పలమనేరు, జనవరి20 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ కేంద్రంగా కొనసాగుతున్న రైతు ఉద్యమం పట్ల ఉదాశీనత తగదని సత్వర పరిష్కారం చూపాలని రైతు సంఘాల సమన్వయసమాఖ్య పేర్కొంది. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపు మేరకు సోమవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్లప్రసాద్ వ్యక్తిగత సహాయకుడికి రైతు సంఘ అధ్యక్షకార్యదర్శులు టి.జనార్దన్, కె. మునిరత్నంనాయుడు, రైతు కూలీ సంఘ కార్యదర్శి ఉమాపతినాయుడు, రైతు కూలీ సంఘం కార్యదర్శి ఉమాపతినాయుడు రైతు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

## వ్యవసాయానికి ఉపాధి హామీని అనుసంధానించండి

సోమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించి రైతులకు చేయూతనివ్వాలని టీడీపీ మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శి అష్రఫ్ ఆలీ కోరారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో రైతులు క్రాప్ హాలిడే ప్రకటిస్తున్నారని అన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంలు స్పందించి వరి, టమోటా, చెరుకు ఇతర పంటలకు కూలీలతో పనులు కల్పించి రైతులకు అండగా నిలవాలని కోరారు.

## పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి




సోమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సోమల పశుసంవర్ధక శాఖ ఏడీహెచ్ శ్రీనివాసులునాయుడు కోరారు. సోమవారం తమ్మినాయనపల్లె పంచాయతీ కోటగుండ్లపల్లెలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశుపోషణలో తీసుకోవాల్సి జాగ్రత్తలు వివరించారు. పశువులకు పిడుదల మందు పిచికారీ చేశారు. నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందన ప్రియ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీలు కోలుకుంటున్నాయ్


గోనుగూరు పంచాయతీ కార్యాలయం ఎదుట శుభ్రమైన పరిసరాలలో తుప్పు పట్టి కనిపిస్తున్న విరిగిన చెత్తబండి

కుప్పం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నిధుల లేమిత ఒక్కటంటే ఒక్క పనికూడా చేయలేక పోయిన నాటి సర్పంచ్‌లు ప్రజలముందుకు రాలేక ముఖాలు తప్పించుకుని తిరిగారు. నాటి పంచాయతీల దుస్థితికి చిహ్నాలుగా నేటికీ గ్రామాలలో కొన్ని కొండ గుర్తులు కనిపిస్తున్నాయి. ఇదిగో ఇక్కడ చక్రాలు ఊడి, చిలుముపట్టి వీధి పక్కన ఒరిగిన ఈ మూడుచక్రాల చెత్తబండి అటువంటి కొండగుర్తుల్లో ఒకటి. కుప్పం మండలంలోని పంచాయతీ కేంద్రమైన గోనుగూరు గ్రామంలో సాక్షాత్తు గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రహరీని ఆనుకుని రోడ్డుమీద కనిపించిన చిత్రమిది. గత ప్రభుత్వం పంచాయతీల పారిశుధ్యాన్ని ఏమాత్రం పట్టించుకోలేదన్న వాస్తవానికి చక్కటి నిదర్శనమిది. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్ట్ కింద జీరో వేస్ట్ పంచాయతీలను ఎంపికచేసి ఇటువంటి మూడు చక్రాల చెత్త బండ్లను నాడు పంచాయతీలకు పంపిణీ చేశారు. అయితే వీటిని ఎన్నడూ వాడిన పాపాన పోకపోవడంతో ఇలా ఎందుకూ పనికిరాకుండా విరిగి, మూలన పడ్డాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతోంది. ఈ ఆరు నెలల కాలంలోనే పంచాయతీల స్వయం సమృద్ధ పాలనకు తెరతీసింది. జీరో వేస్ట్ పంచాయతీలను పునరుద్ధరించి పరిశుభ్రమైన పరిసరాలను ప్రజలను బహుమతిగా ఇవ్వడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టి సంకల్పం పలికారు. అందుకనే ఒకనాటి చెత్తబండి విరిగి మూలన పడినా, దాని చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా మెరిసిపోతున్నాయి.

# అదనపు కోర్టు ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీపతి, సభ్యులు


పలమనేరు, జనవరి20 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో అదనపు కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ అధ్య క్షులు లక్ష్మీపతి, సభ్యులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలమనేరులో దాదాపు 5500 కేసులు నడుస్తున్నాయని తెలిపారు. 18 సంవత్సరాలుగా నడు స్తున్న కేసులు కూడా పరిష్కారానికి నోచుకోలేక పోతున్నాయని తెలియజేశారు. పుంగనూరు, కుప్పంలలో సుమారు 3వేల చొప్పున కేసులే ఉన్నా అదనపు కోర్టులు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో పలమనేరుకు అదనపు కోర్టు కోసం హైకోర్టు సిఫార్సు చేసిందన్నారు. ఆ మేరకు కోర్టు మంజూరైనా ఆర్థికశాఖ వద్ద ఫైలు ఆగిపోయిందన్నారు. ఈ క్రమంలో ఆర్థికశాఖ అనుమతి వచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి బర్కత్, న్యాయవాదులు ఎల్.భాస్కర్, లోకేష్, షరీఫ్, జె.సుబ్ర మణ్యం, లక్ష్మణ్, రెడ్డెప్ప, మునిరాజు, ఇబ్రహీం, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

## కంటి పరీక్షలకు విశేష స్పందన

పుంగనూరు రూరల్, జనవరి20(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాల్లో కంటి చూపు మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్ ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని చంద్రమాకులపల్లె గ్రామ సచివాలయ ఆవరణలో గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, కూటమి నాయకులు చైతన్యరాయల్, గంగాధర్, నారాయణరెడ్డి, రాఘవ, చంద్ర, మణి, హరి, వేణు తదితరులు పాల్గొన్నారు.

# నీటి కోసం పొలంబాట

- చిట్టారెడ్డిపేటలో మంచినీటి సమస్య
- వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్న మహిళలు


వ్యవసాయ బోరు నుంచి మంచినీళ్లు తెచ్చుకుంటున్న మహిళలు (ఇన్‌సెట్లో) పాడైపోయిన బోరు

కల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం చల్లావారిపల్లి పంచాయతీ చిట్టారెడ్డిపేటలో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చాలని మహిళలు వేడుకుంటున్నారు. సోమ వారం గ్రామంలోని మహిళలు మాట్లాడుతూ చిట్టారెడ్డిపేటకు మంచినీరు సరఫరా చేసే పంచాయతీ బోరు వారం క్రితం నుంచి పనిచేయక పోవడంతో తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. మంచినీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని, పశువులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాయన్నారు. దీనికి తోడు గ్రామంలోని చేతిపంపు పనిచేయడం లేదన్నారు. గ్రామానికి చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ బోర్లు, గ్రామంలోని మసీదు వద్దకు వెళ్లి మంచినీళ్లు తెచ్చుకుంటున్నామన్నారు. దీనిపై ఎంపీడీవో రాజశేఖర్‌బాబును వివరణ కోరగా తాగునీటి సమస్యను తక్షణం పరిష్కరిస్తామని, బోరు రిపేరు చేసేంతవరకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు.

## కుష్ఠు వ్యాధి పట్ల నిర్లక్ష్యం వీడండి

సోమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి పట్ల ప్రజలు నిర్లక్ష్యం వీడి చికిత్సలతో నయం చేసుకోవాలని పెద్దఉప్పరపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలాజీ తెలిపారు. సోమవారం వైద్య బృందం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఇంటింటా సర్వేను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే కందూరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ నీలిమా, సోమలలో డాక్టర్ జయసింహ ఆధ్వర్యంలో ర్యాలీ జరిపి కుష్ఠు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ఇంటింటి సర్వేలు ప్రాంభించారు.

## బాధిత కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం


చిన్నక్క మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం అయ్యావాండ్లపల్లి పంచాయతీ జ్యోతినగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త మధు తల్లి చిన్నక్క సోమవారం అనారోగ్యంతో మృతిచెందింది. టీడీపీ పుంగనూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆదేశాలతో మండల టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, బండ్ల రమేష్, శింగంశెట్టి మహేష్ తదితరులు గ్రామానికి చేరుకున్నారు. చిన్నక్క మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతురాలి కుమారుడు మధును పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. టీడీపీ నాయకుడు రమణ పాల్గొన్నారు.

## 31 వరకు పశువైద్య శిబిరాలు

చౌడేపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31 వరకు మండలంలో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించ నున్నట్లు పశువైద్యాధికారి పవన్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బాలసముద్రం పంచాయతీలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు నట్టల నివారణ మందులు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, చూడు నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. టీడీపీ పుంగ నూరు నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి వెంకటరమణరాజు, సిబ్బంది గోవర్ధన్, నందకుమార్, రెడ్డిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిన పులిచెర్ల వైసీపీ నాయకులు



రొంపిచెర్ల, జనవరి20 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలో పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో సోమవారం పులిచెర్ల మండలానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. పులిచెర్ల మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గురుస్వామి, మైనార్టీ నాయకుడు జావీద్‌లకు పార్టీ కండువేసి చల్లా రామచంద్రారెడ్డి ఆహ్వానించారు. సర్పంచులు గోపి, వెంకటేశు, మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు, రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ముల్లంగి రమణ, నాయకులు ధనంజయనాయుడు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## మహాకుంభాభిషేకానికి ఎమ్మెల్యే దంపతులకు ఆహ్వానం

పలమనేరు, జనవరి20(ఆంధ్రజ్యోతి) : పెద్దపంజాణి మండలం గోనుమాకులపల్లి గ్రామంలో నిర్మించిన విద్యావరసిద్ధి వినాయకస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవానికి విచ్చేయాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, రేణుకారెడ్డి దంపతులను మాజీ ఎంపీపీ విజయభాస్కరరెడ్డి ఆహ్వానించారు. సోమవారం పలమనేరులోని ఎమ్మెల్యే గృహంలో పుష్పగుచ్ఛాన్ని అందజేసి ఈ నెల 22, 23, 24 తేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని, చివరిరోజున నూతన విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక కార్యక్రమానికి విచ్చేయాలని ఆహ్వానించారు. టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు అమరనాథరెడ్డి, మాజీ ఇంటెలిజెన్స్ అధికారి సుబ్రమణ్యంరెడ్డి, ధర్మకర్త నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.

## పెళ్లి ఇష్టం లేక యువతి ఆత్మహత్య


మైత్రి (ఫైల్‌ఫొటో)

బైరెడ్డిపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లిచేసుకోవడం ఇష్టం లేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ పరశురాముడు కథనం మేరకు.. మండలంలోని కడతట్లపల్లె గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి కుమార్తె మైత్రి(21) మైత్రి ఇంటర్ వరకు చదివింది. తల్లిదండ్రులు పెళ్లిసంబంధాలు చూస్తున్నారు. పెళ్లి చేసుకోవడం ఇష్టంలేక ఆదివారం సాయంత్రం పురుగులమందు తాగింది. కుటుంబీకులు పలమనేరు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

# పశువైద్య శిబిరం విజయవంతం



కుప్పం, జనవరి 20 (ఆంధ్ర జ్యోతి): కుప్పం మండలం వెండుగం పల్లెలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరం విజయవంతమైంది. పెద్ద సంఖ్యలో ఆవులకు, గొర్రెలకు అవసరమైన మందులు, ద్రావణాలు ఇవ్వడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఉదయం 7.30 నుంచి మధ్యా హ్నం 12.30 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో 254 ఆవులు, 154 గొర్రెలకు వైద్యం చేశారు. నట్టల నివారణ మందులు ఇవ్వ డమేగాక, పిడుదులు, గోమారు పోవడానికి బుటాక్స్ స్ప్రే చేశారు. 58 ఆవులకు గర్భకోశ చికిత్సలు చేశారు. సుమారు 120 ఆవులకు సాధారణ వ్యాధులకు చికిత్స చేశారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా పాడి ఉత్పత్తి పెంచుకునే విధానాలపై పాడి రైతులకు అవగాహన కలిగిం చారు. సాయంత్రం నాటు కోళ్లకు ఆర్డీకే వ్యాక్సిన్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, పశుసంవర్ధక శాఖ ఏడీ రెడ్డికుమారి, మల్లానూరు ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి డాక్టర్ కోదండ, పైపాళ్యం పశువైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి, స్థానిక నాయకులు రమేశ్, రామచంద్ర, పార్థసారథి, అశోక్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు దశాబ్దాలుగా మూతపడిన విశ్రాంతిభవనం



పలమనేరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో జాతీయరహదారి పక్కనే టవర్ క్లాక్ వద్ద ఉన్న జడ్పీ విశ్రాంతి భవనం రెండు దశాబ్దాలుగా మూతపడి ఉంది. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనంలో ఫర్నిచర్ పూర్తిగా విరిగిపోయింది. భవనం ఉరుస్తోంది. ఒకప్పుడు సుదూర ప్రాంతాలనుంచి తిరుమలకు వెళ్లే వారు ఇక్కడ విడిది చేసి వెళ్లేవారు. అధికార పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు సైతం ఈ విశ్రాంత భవనంలో ఉండేవారు. క్రమేపీ ఈ భవనం ఆలనపాలన లేకపోవడంతో నేడు శిథిలావస్థకు చేరుకొంది. ఏడాదిన్నర క్రితం ఈ విశ్రాంతి భవనాన్ని, పక్కనే ఉన్న పంచాయితీరాజ్ డీఈ కార్యాలయం సముదాయాలను నూతనంగా నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలని అప్పటి జడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి సూచించారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సైతం ఇక్కడ నూతన విశ్రాంతి భవనం నిర్మిస్తామని గతంలో పేర్కొన్నారు. అయితే వీరి మాటలు నీటి మూటలుగా మిగిలాయి. ప్రభుత్వం స్పందించి ఈ విశ్రాంతి భవనానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని, లేదా వాణిజ్య సముదాయం నిర్మించినా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని స్థానికులు అంటున్నారు. కాగా పలమనేరులో ఉన్న అటవీశాఖ విశ్రాంతి భవనం, ఆర్ అండ్ బీ అతిథి గృహాలు కూడా దుస్థితిలో ఉన్నాయి.

# జోరుగా వరి సాగు


వరి నారు , మడిలో వరినారు నాటుతున్న మహిళలు

రొంపిచెర్ల, జనవరి20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో చెరువుల్లో నీరు చేరడంతో మండలంలో వరి సాగు ఊపందుకుంది. అదేసమయంలో బోర్ల కింద కూడా సాగు చేపట్టారు. మండలంలో 300 హెక్టార్లలో వరి సాగు చేయాల్సి ఉండగా ప్రస్తుతం బొమ్మయ్యగారిపల్లె, పెద్దమల్లెల, గానుగచింత, బోడిపాటి వారిపల్లె పంచాయతీలో ఎక్కువగా వరి సాగుచేస్తున్నారు. ఇదిలా ఉండగా దుక్కులు దున్నడానికి, వరి నాటే కూలీలకు అధిక ఖర్చు అవుతోందని ప్రభుత్వాలు వ్యవసాయానికి ఉపాధి హామీని అనుసంధానిస్తే బావుంటుందని పలువురు రైతులు కోరుతున్నారు. కాగా వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏవో సుధారాణి తెలియజేశారు.

# మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు అవగాహన



సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి రమేష్

చిత్తూరు లీగల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు క్షణికావేశానికి గురై గొడవలు పడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి, న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్ రెడ్డితోపాటు పలువురు న్యాయవాదుల సంఘం నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఐరాలలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా : మురళీమోహన్





మహిళలకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్అన్నారు. సోమవారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ప్రజలకు అవసరమైన ప్రతి పనినీ పార్టీలకు అతీతంగా చేస్తామని స్పష్టం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో 119 డ్వాక్రా సంఘాలకు రూ.17.25కోట్ల మెగా చెక్కును అందించారు. ఐరాలలోని షాదీమహల్‌లో ముస్లిం సోదరులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్ బాబు, జడ్పీటీసీ సుచిత్ర, మాజీ జడ్పీటీసీ లత, టీడీపీ నేత జలీల్‌బాషా పాల్గొన్నారు.

# కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వేపై శిక్షణ



విజయపురంలో వాల్‌పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైద్యసిబ్బంది

బంగారుపాళ్యం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించాలని సిబ్బందికి మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వేపై ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. డాక్టర్ రమేష్, డీపీఎంవో మణి, ఎంపీహెచ్‌ఈవో రమేష్ బాబు, హెల్త్ సూపర్‌వైజర్ హరికృష్ణ పాల్గొన్నారు.

**విజయపురం:** ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి గుణశేఖర్, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలివ్వండి: టీడీపీ



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గుడిపాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డిని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, మాజీ ఎంపీపీ నాగరాజ యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌ని కలిసి మాట్లాడారు. మండలంలో చాలామంది నిరుపేదలు ఉన్నారని చెప్పారు. ఎమ్మెల్యే జగన్మోహన్ ఆదేశాల మేరకు అర్హులను గుర్తించి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# గిరిజనులకు ఇళ్లు మంజూరు చేస్తాం: ఎంపీడీవో



మణిపురం ఎస్టీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి

పాలసముద్రం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మణిపురం గ్రామంలోని గిరిజనులకు ఇళ్లు మంజూరు చేస్తామని ఎంపీడీవో కృష్ణమహేష్ రెడ్డి తెలియజేశారు. సోమవారం మణిపురం ఎస్టీ కాలనీలో అధికారులతో కలసి పర్యటించారు. ఎవరెవరికి ఇళ్లు లేవో సర్వే చేయించారు. ఎక్కువ మందికి ఆధార్, రేషన్‌కార్డులు లేవని గుర్తించారు. వీరందరికీ ఆధార్, రేషన్‌కార్డులు ఇప్పిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమేష్, హౌసింగ్ ఏఈ దాము, కార్యదర్శి సత్యనారాయణ, ఆర్ఐ దేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కారును ఢీకొన్న పాల వ్యాను

పూతలపట్టు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కారును ఓ మినీ పాల వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో పాల వ్యాను డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. కోట్లపల్లెకు చెందిన దిలీప్.. పాలవ్యాన్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి చిత్తూరు - తిరుపతి జాతీయ రహదారిలోని ఒంటిల్లు వద్ద బెంగళూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో దిలీప్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

# రైతు సమస్యలకు పరిష్కారం చూపండి

చిత్తూరు సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలకు పరిష్కారం చూపాలని రైతు సంఘాల సమాఖ్య సభ్యులు కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపుతో సోమవారం ఎంపీలకు అర్జీలు సమర్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరారు. మ్యాంగో బోర్డుకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఏనుగుల బారినుంచి రైతులను, పంటలను కాపాడాలని విన్నవించారు. రైతు ఉద్యమానికి సంఘీభావంగా ఈనెల 26వ తేదీన రెవెన్యూ డివిజన్ కేంద్రాల వద్ద ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతు సంఘాల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు జనార్ధన్, మునిరత్నం నాయుడు, నాగరాజు, సురేంద్ర, మణి, తదితరులు పాల్గొన్నారు.





# స్కిల్ హబ్ కేంద్రంలో యువతకు నైపుణ్య శిక్షణ

## ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్కిల్ హబ్ కేంద్రంలో యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరులోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) స్కిల్ హబ్ ద్వారా యువతకు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ ప్లంబర్, జనరల్ విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 8వ తరగతి, ఆపై విద్యార్హత కలిగిన 15-42 ఏళ్లలోపువారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 26వ తేదీలోపు ఆసక్తిఉన్నవారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఇరువారంలో ఉన్న ఎన్ఏసీ స్కిల్ హబ్ శిక్షణ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. వివరాలకు 99892 45224, 90008 81066, 99664 89502 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

# చేపల చెరువుల వేలంతో రూ.2.91 లక్షల ఆదాయం

వెదురుకుప్పం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మేజర్ పంచాయతీలో చేపల చెరువుల వేలం పాట ద్వారా రూ.2.91లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో నాగరత్నమ్మ సోమవారం తెలిపారు. నగరం చెరువుకు రూ.1.96 లక్షలు, స్వామివారి పాదం చెరువుకు రూ.24వేలు, కుమ్మరగుంటకు రూ.13,500, దొరవారిగుంటకు రూ.50వేలు, కసవరాజగుంటకు రూ.7500 వచ్చిందన్నారు.

# బీసీలకు న్యాయం జరగాలంటే కులగణన కీలకం

చిత్తూరు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, చట్ట సభల్లో బీసీలకు సరైన రిజర్వేషన్లను కల్పించాలన్నా.. ఉద్యోగ, ఇతర రంగాల్లో న్యాయం జరగాలన్నా కులగణన కీలకమని బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం తెలిపారు. సోమవారం సంఘ కార్యాలయంలో చలో ఢిల్లీ పోస్టర్‌ను నేతలతో కలిసి ఆవిష్కరించారు. జనగణనతో పాటు కులగణన కూడా చేపడతామని బీజేపీ నేతలు చెప్పి ఇప్పుడు తాత్సారం చేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి వచ్చేనెల ఆరో తేదీన చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి వందలాదిగా బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నేతలు పూసల రవి, ఈశ్వర్, రాజా, సౌందర్ రాజ్, రవీంద్ర రాజు, హరిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


# రోడ్డు విస్తరణ పనులు జరిగేనా?

## కూటమి ప్రభుత్వంపైనే స్థానికుల ఆశలు

వెదురుకుప్పం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులపై ఏళ్ల తరబడి వెదురుకుప్పం ప్రజలు ఎదురుచూస్తున్నారు. అదిగో.. ఇదిగో అంటూ ఏళ్లు గడిచిపోతున్నాయి. విస్తరణ పనులు జరగక వాహన రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం, పచ్చికాపల్లం నుంచి వెదురుకుప్పం, వెదురుకుప్పం నుంచి ఎస్ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్ట వరకు రోడ్డు విస్తరణ పనులు జరగాల్సి ఉంది. చాలా ఏళ్ల నుంచి ఈ పనులు జరుగుతాయని ఎమ్మెల్యేలు చెబుతూ వస్తూనే ఉన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ చొరవతో తమ సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు ఆశలు పెట్టుకున్నారు.



పచ్చికాపల్లం-కార్వేటినగరం రోడ్డు



పచ్చికాపల్లం - వెదురుకుప్పం రోడ్డు

# ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న తహసీల్దారు బాబూ రాజేంద్రప్రసాద్

బంగారుపాళ్యం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, సీఐ శ్రీనివాసులు కోరారు. సోమవారం 36వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ మధుసూదన్, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# సిద్దేశ్వరకొండ హోమియోపతి ఆస్పత్రి డాక్టర్‌గా అస్మ అంజుమ్



గంగాధరనెల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సిద్దేశ్వరకొండ హోమియోపతి ఆస్పత్రి కొత్త డాక్టర్‌గా ఎస్. అస్మ అంజుమ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 'హోమియోపతి ఆస్పత్రి ఏడాదిగా మూత' శీర్షికన గత ఏడాది డిసెంబరు 18వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి డాక్టర్‌ను నియమించారు.

# క్రికెట్ టోర్నీ విజేత జెట్టివానిఒడ్డు జట్టు



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న రుద్రయ్యనాయుడు

పెనుమూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లె వద్ద సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నీ జరిగింది. చుట్టుపక్కల మండలాల నుంచి 20 టీములు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో గొల్లపల్లె జట్టుపై జట్టివానిఒడ్డు క్రీడాకారులు విజయం సాధించారు. విన్నర్‌కు రూ.15వేలను మాజీ జడ్పీటీసీ రుద్రయ్యనాయుడు అందించారు. రన్నర్స్‌కు రూ.7500లను టీడీపీ నేత అమర్‌నాథ్ ఇవ్వగా, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికైన మునికి షీల్డ్‌ను నిర్వాహకుడు దేవానాయుడు అందజేశారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి భాస్కర్, యువత అధ్యక్షుడు చిరంజీవిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి కార్యవర్గం

చిత్తూరు సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపకుడు సంగటి మనోహర్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు మహిళల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామని చెప్పారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా మునస్వామి, కన్వీనర్‌గా పార్థసారథి, కోకన్వీనర్లుగా ఉదయ్‌కుమార్, అశోక్ కుమార్, సభ్యులుగా కరుణాకరన్, రాజేష్, జయకుమార్, బుల్లెట్ వాసులను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

# ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం



బోరునుంచి సమృద్ధిగా వస్తున్న తాగునీరు

నగరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నెత్తంకండ్రిగ ఎస్టీ కాలనీకి ఎమ్మెల్యే భానుప్రకాష్ చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తుడా నిధులు రూ.4.50లక్షలతో బోరువేయించి, మోటారు అమర్చారు. బోరులో నీరు సమృద్ధిగా రావడంతో నెత్తంకండ్రిగ ఎస్టీ కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

# ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

పుంగనూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎన్జీవో సంఘ నాయకులు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి విన్నవించారు. సోమవారం రొంపిచెర్లలోని ఆయన స్వగృహంలో ఎన్జీవో ఉద్యోగసంఘ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్జీవో సంఘనాయకులు రహ్మత్అలీఖాన్, సురేశ్‌రాజు, లక్ష్మినారాయణ, సుబ్రహ్మణ్యం, దాము, వెంకటముని, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

# కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

కుప్పం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఇటీవల వెలువడిన ఫైనల్ ఇయర్, సెకండ్ ఇయర్ పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపాల్ ఎం.జగన్నాథరావు తెలిపారు. కంప్యూటర్స్ విభాగంలో నవనీత్ 889, ఎలక్ట్రానిక్స్ విభాగంలో వి.తేజస్విని 984మార్కులు సాధించారన్నారు. కడా ఆధ్వర్యంలో అంతకుముందు జరిగిన క్రాక్ అకాడమీ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ చూపిన తమ విద్యార్థిని ఒ.వెన్నెలను కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు అభినందించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

# ఉపాధి హామీ పనుల తనిఖీ



కమ్మారాయనిమిట్ట చెరువులో పనులను తనిఖీ చేస్తున్న శివయ్య

యాదమరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కోణాపల్లె పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద చెరువులో చేపట్టిన పనులను జిల్లా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలోని రికార్డులను జిల్లా విజిలెన్స్ అధికారి శివయ్య పరిశీలించారు. అనంతరం కమ్మారాయనిమిట్ట చెరువులో ఇటీవల రైతులు రూ.ఆరు లక్షల వ్యయంతో నిర్మించిన ఫారం పాండ్, ఫిష్ పాండ్ కొలతలు పరిశీలించి, ఏపీవో బాలను వివరాలు అడిగి నమోదు చేశారు. ఉపాధి కూలీలకు అవసరమైన పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయనవెంట జేఈ పరమశివం, టెక్నికల్ అసిస్టెంట్ మధు, ఫీల్డ్ అసిస్టెంట్ బాబు ఉన్నారు.

# అనాథకు 'అమ్మఒడి' అంత్యక్రియలు



పాడె మోస్తున్న పద్మనాభ నాయుడు తదితరులు

చిత్తూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అమ్మఒడి ఆశ్రమంలో తమిళనాడుకు చెందిన రామస్వామి (65) అనే అనాథ ఆశ్రయం పొందుతున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. ఆశ్రమ నిర్వాహకుడు పద్మనాభనాయుడు తన సిబ్బందితో కలిసి సంప్రదాయంగా అంత్యక్రియలు నిర్వహించారు. సభ్యులు మధుబాబు, దనమ్మ, బ్రహ్మాచారి, ప్రకాష్, హుస్సేన్, లలిత తదితరులు పాల్గొన్నారు.

# రెండు దశాబ్దాలుగా మూతపడిన జడ్పీ విశ్రాంతి భవనం



పలమనేరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో జాతీయరహదారి పక్కనే టవర్ క్లాక్ వద్ద ఉన్న జడ్పీ విశ్రాంతి భవనం రెండు దశాబ్దాలుగా మూతపడి ఉంది. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనంలో ఫర్నిచర్ పూర్తిగా ధ్వంసమైంది. భవనం ఉరుస్తోంది. ఒకప్పుడు సుదూర ప్రాంతాలనుంచి తిరుమలకు వెళ్లేవారు ఇక్కడ విడిది చేసి వెళ్లేవారు. అధికార పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు సైతం ఈ విశ్రాంత భవనంలో ఉండేవారు. క్రమేపీ ఈ భవనం ఆలనపాలన లేకపోవడంతో నేడు శిథిలావస్థకు చేరుకొంది. ఏడాదిన్నర క్రితం ఈ విశ్రాంతి భవనాన్ని, పక్కనే ఉన్న పంచాయితీరాజ్ డీఈ కార్యాలయం సముదాయాలను నూతనంగా నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలని అప్పటి జడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి సూచించారు. జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు సైతం ఇక్కడ నూతన విశ్రాంతి భవనం నిర్మిస్తామని గతంలో పేర్కొన్నారు. అయితే వీరి మాటలు నీటి మూటలుగా మిగిలాయి. ప్రభుత్వం స్పందించి ఈ విశ్రాంతి భవనానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని, లేదా వాణిజ్య సముదాయం నిర్మించినా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని స్థానికులు అంటున్నారు. కాగా పలమనేరులో ఉన్న అటవీశాఖ విశ్రాంతి భవనం, ఆర్అండ్‌బీ అతిథి గృహాలు కూడా దుస్థితిలో ఉన్నాయి.

# టీడీపీలో చేరిన పులిచెర్ల వైసీపీ నాయకులు

రొంపిచెర్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలో పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో సోమవారం పులిచెర్ల మండలానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. పులిచెర్ల మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గురుస్వామి, మైనార్టీ నాయకుడు జావీద్‌లకు పార్టీ కండువేసి చల్లా రామచంద్రారెడ్డి ఆహ్వానించారు. సర్పంచులు గోపి, వెంకటేశు, మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు, రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ముల్లంగి రమణ, నాయకులు ధనంజయనాయుడు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# పశు ఆరోగ్య వైద్య శిబిరాలు



అగరం పంచాయతీలో ఆవుకు నట్టల నివారణ ముందు వేస్తున్న సిబ్బంది

గుడిపాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బొమ్మసముద్రంలో సోమవారం పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు వేసి.. వైద్యపరీక్షలు చేసి వాటి యజమానులకు మందులు అందజేశారు. పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**నిండ్ర:** మండలంలోని అగరం పంచాయితీలో జరిగిన శిబిరంలో పశువుల్లో నట్టల నివారణకు మందులు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి ప్రభాకర్ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

**పెనుమూరు:** గుంటిపల్లె, పెరుమాళ్లపల్లె గ్రామాల్లో జరిగిన శిబిరాల్లో 220 పశువులకు, 1220 గొర్రెలు, మేకల్లో నట్టల నివారణకు మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, వైద్య సిబ్బంది గోపి, జ్యోతి, పాడి రైతులు పాల్గొన్నారు.

**విజయపురం:** మండల కేంద్రంలో జరిగిన శిబిరంలో పశువైద్యాధికారి శివకుమార్, సర్పంచ్ జపమేరీప్రసన్నకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

### నగరి డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



అజీజ్

నగరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరి డీఎస్పీగా సయ్యద్ మొహమ్మద్ అజీజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2022 బ్యాచ్‌కు చెందిన డీఎస్పీలకు పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన కర్నూలు నుంచి ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ.. గంజాయిపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

### మెదడు శస్త్ర చికిత్సలు విజయవంతం

చిత్తూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని ఏకే అమ్మా ఆస్పత్రిలో మెదడు శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు న్యూరో సర్జన్ డాక్టర్ కళ్యాణ్ బాబు తెలిపారు. నగరానికి చెందిన వసంతమ్మ(75) రెండు వైపులా బ్రెయిన్ పక్షవాతానికి గురవగా 13 గంటల పాటు శ్రమించి ఆపరేషన్ చేశామన్నారు. నగరానికి చెందిన వేణుగోపాల్(70) బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టడంతో ఆపరేషన్ చేసి.. బ్లడ్ క్లాట్‌ను తొలగించడం జరిగిందన్నారు. పల్మనాలజిస్టు అశోక్ పాల్గొన్నారు.

### బురదమయంగా రహదారి




ధర్మరాజులపురం రోడ్డు దుస్థితి

గుడిపాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చిత్తపార పంచాయతీ ధర్మరాజులపురం వెళ్లే రహదారి కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. దీనివల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలోనూ ఈ రోడ్డును బాగు చేయాలని ఎన్నో అర్జీలిచ్చామని తెలిపారు. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

### వైసీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శికి సన్మానం

వెదురుకుప్పం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా కార్వేటినగరానికి చెందిన రాయలచెరువు బాలాజి నియమితులయ్యారు. దీంతో సోమవారం ఆయన్ను కార్వేటినగరంలో వైసీపీ శ్రేణులు సత్కరించాయి. ఎంపీపీ లత, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, కార్వేటినగరం పార్టీ అధ్యక్షుడు శేఖర్‌రాజు, మండల కో-ఆప్షన్ మెంబరు పట్నం ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### పెళ్లి ఇష్టం లేక యువతి ఆత్మహత్య



మైత్రి (ఫైల్‌ఫొటో)

బైరెడ్డిపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ పరశు రాముడు కథనం మేరకు.. మండలంలోని కడతట్లపల్లె గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి కుమార్తె మైత్రి(21) మైత్రి ఇంటర్ వరకు చదివింది. తల్లిదండ్రులు పెళ్లిసంబంధాలు చూస్తున్నారు. పెళ్లి చేసుకోవడం ఇష్టంలేక ఆదివారం సాయంత్రం పురుగులమందు తాగింది. కుటుంబీకులు పలమనేరు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

### పలమనేరులో అదనపు కోర్టు ఏర్పాటు చేయాలి

పలమనేరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో అదనపు కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీపతి, సభ్యులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి బర్కత్, న్యాయవాదులు ఎల్.భాస్కర్, లోకేష్, షరీఫ్, జె.సుబ్రమణ్యం, లక్ష్మణ్, రెడ్డెప్ప, మునిరాజు, ఇబ్రహీం, సుబ్బరామయ్య పాల్గొన్నారు.